క్లుప్తంగా

ప్రజలకు అందుబాటులో ఉండాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్ : గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ రాముడు ఆదేశించారు. శనివారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ రికార్డులను పరిశీలించడంతో పాటు, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ సిటిజన్, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. అంతకుముందు ఎంపీడీఓ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించడంతో పాటు, గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు.

విశిష్ట గుర్తింపు కార్డును సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న విశిష్ట గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. శనివారం మండలంలోని వర్కూరులో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి మొక్కజొన్న పంటపై 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఏఓ రైతులతో మాట్లాడుతూ రైతులంతా తమ ఆధార్, పొలం పాసుపుస్తకాలను తీసుకుని వెళ్లి ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి



గడివేముల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల ఎస్ఆర్‌బీసీ కాలనీలో పచ్చని చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు వంగాల మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దేశం నాగేశ్వరరెడ్డి కోరారు. శనివారం వారు చెట్లను నరికివేతపై డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్ల పరిసర ప్రాంతాల్లోని దాదాపు 50 ఏళ్ల నాటి చెట్లను గత కొన్ని రోజుల నుంచి కొట్టివేస్తున్నారన్నారు. మండలస్థాయి అధికారులు చూస్తూ వెళ్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న దృశ్యం

పాణ్యం: ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం కళాశాలలో శాంతిరామ్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో అనేక మంది రక్తం దొరక్క ప్రాణాలు కోల్పోతుంటారన్నారు.అలాంటి వారికి యువకులు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్-కోఆర్డినేటర్ నాగరాజు, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జ్ సురేష్, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మాజీ సీఎంకు రక్షణ కల్పించడంలో విఫలం

కోడుమూరు రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ ఆరోపించారు. శనివారం ఆయన కోడుమూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక ఓటు బ్యాంకు కలిగివున్న వ్యక్తి కావడంతోనే రాష్ట్ర ప్రభుత్వం జెడ్ ప్లస్ క్యాటగిరీ భద్రత ఏర్పాటు చేయాల్సింది పోయి కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. దురుద్దేశంతోనే జగన్‌మోహన్ రెడ్డికి భద్రత తగ్గించారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ పార్టీల కూడా 40 శాతం ఓట్లు రాలేదన్నారు. సింగిల్‌గా పోటీ చేసిన వైఎస్సార్‌సీపీకి 40 శాతంకు పైగా ఓట్లు వచ్చాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

బ్రహ్మోత్సవాలకు రారండోయ్

- దక్షిణకాశీగా వెలుగొందుతున్న దుర్గా భోగేశ్వరాలయం
- ఈనెల 25 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు
- 28న రథోత్సవం ● భారీగా తరలిరానున్న భక్తులు



పూజలందుకుంటున్న భోగేశ్వరుడు



ప్రధాన కోనేరు



భోగేశ్వరాలయం వ్యూ



ఉత్సవాలకు సిద్ధంగా ఉన్న రథం

గడివేముల: భక్తులకు భోగభాగ్యాలిచ్చే భోగేశ్వరుడు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్నారు. మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలోని ఎర్రకనుమ కొండల్లో వెలసిన ఈ స్వామి క్షేత్రం దక్షిణకాశీగా వెలుగొందుతోంది. కాశీలో తప్ప మరే క్షేత్రంలో లేని కాలభైరవుడు ఇక్కడ ఉండటం విశేషం. ఇలా ఎన్నో ప్రత్యేకతలు గాంచిన ఈ క్షేత్రంలో కోనేరు, పరిసరాలు భక్తులకు కనువిందు చేస్తాయి. దీంతో ఏటా మహాశివరాత్రి ఉత్సవాలకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈనెల 25 నుంచి ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయాధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

ఐదురోజుల పాటు ఉత్సవాలు

శ్రీదుర్గా భోగేశ్వరాలయంలో ఐదురోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. తొలి రోజు ఈనెల 25వ తేదీన గడిగరేవుల గ్రామంలో ఉత్సవ మూర్తులకు వరప్రయాణం, 26న స్వామివారి ఆలయ ప్రవేశం, నందివాహన, పుణ్యావాచనం,. ధ్వజారోహణం కార్యక్రమాలు జరుగుతాయి. 27న నంది వాహనోత్సవం, స్వామివార్ల తిరుమంజనము, అభిషేకార్చనలు, నైవేద్యాల సమర్పణ, తెల్లవారు జామున స్వామివారి కల్యాణోత్సవం, 28న రథోత్సవం, మార్చి1వ తేదీన నాకబలి, వసంతోత్సవంతో బ్రహోత్సవాలు ముగుస్తాయి. కాగా ఈ ఉత్సవాల సమయంలో నంద్యాల, నందికొట్కూరు ఆర్టీసీ డిపోల నుంచి క్షేత్రానికి ప్రత్యేక బస్సుల నడుపనున్నట్లు ఈఓ రామానుజన్ తెలిపారు.

సాంస్కృతి కార్యక్రమాలు

27,28 వ తేదీల్లో రాత్రి భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు. అలాగే ఆలయానికి వచ్చిన భక్తులకు శ్రీదుర్గాభోగేశ్వరస్వామి, కాశీరెడ్డినాయన, బ్రాహ్మణ, రెడ్డి, వీరశైవ, ఆర్యవైశ్య సత్రాల్లో ఉచితంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

దిగుబడిపై దుమ్ముకొడుతున్నారు!



భారీ వాహనం వెళ్తుండగా పైకి లేచిన దుమ్ము



దుమ్ముకు దెబ్బతిన్న మిరప పంట

గడివేముల– నందికొట్కూరు మార్గంలో పలు చోట్ల రోడ్డు దెబ్బతినింది. మరమ్మతు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గడివేముల నుంచి తలముడిపి బాట వరకు సగం పనులు చేశాడు. రోడ్డు బాగా లేనిచోట తవ్వి స్టోన్ డస్ట్ వదిలేశాడు. ఈ మార్గంలో ప్రతి రోజు వందలాదిగా భారీ వాహనాలు తిరుగుతుంటాయి. అవి వెళ్లేటప్పుడు రోడ్డు బాగాలేనిచోట దుమ్ము లేస్తుండటంతో వెనుక వచ్చే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా రోడ్డు పక్కన సాగు చేసిన మిరప, మొక్కజొన్న పంటలపై దుమ్ముచేరి దెబ్బతింటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేసి పంట నష్టం జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. –గడివేముల

24న సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

కోడుమూరు రూరల్ : బీసీ, ఈబీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24న కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 68 యూనిట్లకు గాను 1,281మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని, వీరికి ఈనెల 24న బ్యాంకర్లతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

గూడూరులో..

గూడూరు మండలానికి సంబంధించి కార్పొరేషన్ రుణాలకు గూడూరు ఎంపీడీఓ కార్యాలయంలో 24న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివ నాగప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 60 యూనిట్లకు 385మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరంతాఇంటర్వ్యూలకు తప్పక హాజరవ్వాలన్నారు.

రేపు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో ఈ నెల 24వ తేదీన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారుడు రాధాకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో 108 మంది దంపతులతో స్థానిక జీవేశ్వరస్వామి కళ్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో పాల్గొనే దంపతులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల ఓంశాంతి బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వ్రతానికి సంబంధించిన పూజా సామగ్రిని దంపతులే తెచుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



చెత్త డబ్బాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్య త అని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని హుసేనాపురం గ్రామంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీ అధికారులు చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత పాటించకపోతే వ్యాధులు దరిచేరుతాయని చెప్పారు. అనంతరం సోమయాజులపల్లె గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి, కూలీలకు కనీస వేతనం రూ.300 వచ్చేలా పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అక్కడి నుంచి కాల్వబుగ్గలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్‌తో పాటు ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, పంచాయతీ కార్యదర్శి సురేష్, కాల్వబుగ్గ ఈఓ మద్దిలేటి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కర్నూలు న్యూసిటీ: సెలవు దినం అయినప్పటికీ ఆదివారం విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కేంద్రాలు కేంద్రాలు తెరిచి ఉంటాయని ఎస్ఈ ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

బోదకాలు వ్యాధిని నిర్మూలిద్దాం



చికిత్స విధానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కర్నూలు(రూరల్): ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించి కలిసికట్టుగా బోదకాలు వ్యాధిని నిర్మూలిద్దామని డీఎంఓ నూకరాజు పిలుపునిచ్చారు. శనివారం గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోదకాలు బాధితులు ఏడుగురికి ఉచిత కిట్లతో పాటు మందులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఇంటి పరిసరాల్లో ఉన్న మురుగునీటిలో ఈ దోమ గుడ్లు పెట్టి వృద్ధి చెందుతుందని చెప్పారు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చేందుతుంది తెలిపారు. ఈ వ్యాధి సంక్రమించకుండా సంవత్సరానికి ఒక మోతదు డీఈసీ మరియు ఆల్బెండజోల్ మాత్రాలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ చంద్రశేఖర్, గార్గేయపురం ప్రథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకారం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్లోని శ్రీ వాల్మీకి రామాలయ నిర్మాణానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి సహకారం అందించినట్లు ఆయల కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యుల విన్నపం మేరకు డోన్ ఎమ్మెల్యే ఆలయ గోపుర నిర్మాణానికి అవసరమైన 526 బస్తాల సిమెంట్‌ను విరాళంగా అందజేశారు. శనివారం సిమెంట్ బస్తాల లారీ గ్రామాలనికి రావడంతో కమిటీ సభ్యులు గ్రామ పెద్దలతో కలిసి ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు.

ఆదర్శపాఠశాలలు పిలుస్తున్నాయి!

- 6వ తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- మార్చి 30 తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 24న ప్రవేశ పరీక్ష



గడివేముల ఏపీ మోడల్ స్కూల్

గడివేముల: పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్య అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఆదర్శపాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఏటా 80 మంది విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశాలు కల్పించి వారికి ఇంటర్ వరకు ఆంగ్లమాధ్యమంలో ఉచిత బోధన, వసతి కల్పిస్తారు. ఇందులో చేరేందుకు గ్రామీణ విద్యార్థులు ఆసక్తి చూపతుండటంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీట్ల సంఖ్యను 80 నుంచి 100కు పెంచింది. ప్రవేశ పరీక్షలో కనబర్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని అధికారులు వెల్లడించారు.

దరఖాస్తు చేసుకునే విధానం

2025-26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివిన వారై ఉండాలి. విద్యార్థులు ఏపీ ఆన్‌లైన్ ఇంటర్‌నెట్ సెంటర్లలలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాలి. దరఖాస్తుతో పాటు ఆధార్, కులం ఆదాయం సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్ ఆదర్శపాఠశాలల్లో అందజేయాలి. ఈనెల24 నుంచి మార్చి 30వ తేది లోపల ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

రిజర్వేషన్లు ఇలా..

15 శాతం ఎస్సీలకు, 6శాతం ఎస్టీలకు, 20శాతం బీసీలకు (7శాతం బీసీ-ఎ, 10శాతం బీసీ-బి, బీసీ-సీలకు ఒకశాతం, బీసీ-డీలకు 7శాతం, బీసీ-ఈ లకు (శాతం) సీట్ల కేటాయింపులు ఉంటాయి. దివ్యాంగులకు 3 శాతం, బాలికలకు 33.33 శాతం సీట్లు కేటాయించారు. నిర్దేశించిన విభాగాల్లో అభ్యర్థులు లేకపోతే ఇతర గ్రూపుల నుంచి భర్తీ చేస్తారు. 50 శాతం సీట్లు ఇతర కులాలకు కేటాయించారు.

ప్రవేశ పరీక్ష ఇలా..

ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24వ తేదీన ఏపీ మోడల్ పాఠశాలల్లో ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ పద్ధతిలో తెలుగు,ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించేందుకు ఆదర్శ పాఠశాలలు నెలకొల్పారు. ఇందులో ప్రవేశం లభిస్తే ఇంటర్‌వరకు పైసా ఖర్చులేకుండా చదువుకోవచ్చు. నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. మండలంలో అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు.

–శైలజ, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, గడివేముల

పకడ్బందీగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

- అధికారులకు డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ ఆదేశం



డీఆర్‌ఓకు వెంకట నారాయణమ్మకు బొకే అందజేస్తున్న ఆర్ఐఓ ఎస్‌వీఎస్ గురవయ్య శెట్టి

కర్నూలు కల్చరల్: ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ సి. వెంకట నారాయణమ్మ ఆదేశించారు. శనివారం టౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, కస్టోడియన్లతో అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ అందరూ బాధ్యతా యుతంగా పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు సమకూర్చాలన్నారు. మాల్ ప్రాక్టీస్‌ను పూర్తిగా నిరోధించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్ఐఓ ఎస్‌వీఎస్ గురవయ్య శెట్టి మాట్లాడుతూ పరీక్షలు సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత సీఎస్, డీఓలపై ఉందన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పరీక్ష విధుల్లో ఉన్న అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై బోర్డు ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయన్నారు. ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కమీషనర్ చంద్రబోష్, స్పెషల్ ఆఫీసర్ లాలెప్ప, టౌన్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, డీఈసీ మెంబర్స్ పద్మావతి, సురేష్ చంద్ర, డిస్ట్రిక్ట్ బల్క్ ఆఫీసర్ రమాదేవి, జేఎల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురళి, తదితరలు పాల్గొని మాట్లాడారు.

పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి



చెత్త డబ్బాలు పంపిణీ చేస్తున్న డీపీఓ భాస్కర్

సి.బెళగల్: గ్రామాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) భాస్కర్ కోరారు. శనివారం మండల కేంద్రం సి.బెళగల్లో పర్యటించి గ్రామంలో సర్పంచ్ పాండురంగన్న ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. మండల అధికారులతో కలిసి గ్రామంలో పారిశుద్ధ్య కూలీలు నిర్వహించిన ఇంటింటి చెత్త సేకరణలో పాల్గొని, గ్రామస్తులకు పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఇళ్లలోని చెత్తను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలన్నారు. గ్రామస్తులకు తడి, పొడి చెత్త సేకరణ డబ్బాలను అందజేశారు. అదేవిధంగా చెత్త నుంచి సంపద కేంద్రం ఏర్పాటుపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేలా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ ఫొటోలను గ్రామాల్లో ప్రదర్శించాలని పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణిని డీపీఓ ఆదేశించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలించిన నిర్వహణపై ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామికి సూచనలు చేశారు.

రాజీవ్ గృహకల్ప ఇళ్లకు మరమ్మతులు చేయాలి



సంతకాల సేకరణ చేస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: పెద్దపాడు సమీపంలో పేదల కోసం నిర్మించిన రాజీవ్ గృహకల్ప సముదాయానికి మరమ్మతులు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ నగర సమితి ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్ప ఇళ్లను పరిశీలించారు. చాలా గృహాలు పెచ్చులూడి దెబ్బతిని ఉన్నాయని తెలిపారు. భవనం కూలకముందే మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, రామాంజి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్, నాయకులు పద్మావతి, చంద్ర, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేల్లో వేగం పెంచండి

- గూగుల్ మీట్‌లో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ/ వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో జరుగుతున్న మిస్సింగ్ సిటిజన్, హౌస్ ఇమేజ్ క్యాప్చరింగ్, జీయో కోఆర్డినేట్స్, ఎన్‌పీసీఐ యాక్షన్ టోకెన్, ఈకేవైసీ తదితర సర్వేల్లో వేగం పెంచాలని జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన జెడ్పీలోని తన చాంబర్ నుంచి జిల్లాలోని ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు, ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలోగా సర్వేలను పూర్తిచేసి రాష్ట్రంలోనే జిల్లాను ముందు వరుసలో నిలపాలన్నారు. ఈ నేపథ్యంలోనే 0 నుంచి 6 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న పిల్లల ఆధార్‌కార్డుల జనరేషన్‌కు సంబంధించి సీడీపీఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకొని ఆధార్ లేని పిల్లలకు త్వరితగతిన ఆధార్‌కార్డులు వచ్చేలా చూడాలన్నారు. ఆధార్ వెరిఫికేషన్‌ను కూడా ఎంపీడీఓలు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామ/ వార్డు సచివాలయ సిబ్బంది రోజు వారీ హాజరు తప్పకుండా వేయాలని, లేని పక్షంలో షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. ఎస్‌బీఎం పనితీరును కూడా మెరుగుపరిచి ఆయా గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దాలన్నారు.

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



కోనా వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వెంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలో వెలసిన భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. గ్రామస్తులతో పాటు సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారికి పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు కొండపై అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పిల్లల మనసు గెలుచుకోవాలి



పిల్లల పుట్టినరోజు వేడుకల నిర్వహణపై డెమో ఇస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్

కల్లూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రానికి వచ్చే పిల్లల మనసు గెలుచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) శామ్యూల్ పాల్ చెప్పారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని శనివారం డీఈఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను ఎలా రప్పించుకోవాలో వివరించారు. కేంద్రాల్లో ప్రతి కార్యకర్త పిల్లలతో కలిసి ఇంటి వాతావరణం సృష్టించాలన్నారు. కేంద్రంలో పిల్లల పుట్టిన రోజు వేడుకలను ఎలా జరపాలో డేమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాసులు, వనజకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.